క్లుప్తంగా

వైభవంగా శాంతి కల్యాణం



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కరప: మండలం యండమూరులో కొలువైన సామ్రాజ్యలక్ష్మి, గోదా సమేత వెంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం శాంతిక ల్యాణం నిర్వహించారు. ఆషాఢ బహుళ ఏకాదశిని పురస్కరించుకుని ఈ కల్యాణం నిర్వహించినట్టు ఆలయ ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం తెలిపారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత శిక్షణ

బోట్‌క్లబ్: కాకినాడ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సిలికాన్ ఇన్ఫోసిస్టమ్స్ సహకారంతో బ్రాహ్మణ విద్యార్థులకు హార్డ్‌వేర్, నెట్‌వర్క్‌పై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంఘ అధ్యక్షుడు అజ్జరపు మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలలు కాల పరిమితితో ఈ శిక్షణ ఉంటుందన్నారు. ఇంటర్ ఆ పైన చదివిన విద్యార్థులు ఈ శిక్షణకు అర్హులన్నారు. ఈ శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 88855 51614 నెంబర్‌లో సంప్రదించవచ్చునన్నారు.

తలసేమియా రోగికి రక్తదానం



కాకినాడ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో 30వ సారి రక్తదానం చేస్తున్న ఆనంద పురుషోత్తమరావు

కరప: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న ఒక బాలుడికి రక్తదానం చేసి, మానవత్వాన్ని చాటుకున్నారు కాండ్రేగుల నివాసి పేపకాయల ఆనంద పురుషోత్తమరావు. ఏలేశ్వరం గ్రామానికి చెందిన ఆనంద్ అనే బాలుడికి అత్యవసరంగా బి.నెగిటివ్ గ్రూపు రక్తం అవసరమైంది. గురువారం ఈ విషయాన్ని దొంతమూరులోని ఇండియన్ బ్లడ్ బ్రదర్స్ ఫౌండేషన్ ప్రతినిధి గుండ్ర చైతన్య తెలుసుకుని, కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును సంప్రదించారు. ఆయన తన మిత్రుడు కాండ్రేగుల గ్రామానికి చెందిన ఆనంద పురుషోత్తమరావుకు తెలిపి, కాకినాడ రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌కు తీసుకెళ్లగా, దాత 30వ సారి రక్తదానం చేశారు. రక్తదాతకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు సంగీత కచేరీ

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో గానసభ ఆధ్వర్యంలో సంగీత ప్రవంతి నిర్వహణలో శనివారం సాయంత్రం సంగీత కచేరి నిర్వహించనున్నట్టు నిర్వాహకురాలు పెద్దాడ సూర్యకుమారి తెలిపారు. ముందుగా వీణా విద్వాంసురాలు దేవిశ్రీ ప్రియ వీణావాదన ద్వారా కీర్తనలు ఆలపిస్తారని తెలిపారు. అనంతరం ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆకొండి శ్రీనివాస రాజారావు గాత్ర కచేరీ జరుగుతుందని తెలిపారు. వీరికి వయోలిన్ విద్వాంసుడు చావలి శ్రీనివాస్, మృదంగ విద్వాంసులు చావలి కృష్ణమోహన్ సంగీత సహకారం అందజేస్తారని తెలిపారు. సంగీత ప్రియులు హాజరుకావాలనీ పెద్దాడ కోరారు.

పురందేశ్వరిని కలసిన జిల్లా నాయకులు

బోట్‌క్లబ్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన దగ్గుబాటి పురందేశ్వరిని విజయవాడ పార్టీ కార్యాలయంలో గురువారం కాకినాడ జిల్లా నాయకులు కలుసుకుని సత్కరించారు. పార్టీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు యార్లగడ్డ రామ్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బిక్కిన విశ్వేశ్వరరావు, నాయకులు గౌతు చిన్నా, రామ్‌మోహన్ ఉన్నారు.

పీఏసీఎస్ సీఈఓల ధర్నా

కరప: రాష్ట్ర సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ పిలుపు మేరకు స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద గురువారం ఆయా సొసైటీల సీఈఓలు, సిబ్బంది ధర్నా చేసి, తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరప డీసీసీబీద శాఖ పరిధిలోని కరప, జెడ్.భావారం, పెనుగుదురు, వేములవాడ, కూరాడ సొసైటీల సీఈఓలు సీహెచ్ మంగతాయారు, రాయుడు వెంకటేశ్వరరావు, నరాల శ్రీనివాసరావు, బి.పరశురామ్, నారాయణమూర్తి, ఈరుగుల వెంకట్రావు తదితర సిబ్బంది ఈధర్నాలో పాల్గొన్నారు. సీఈఓ సంఘం రాష్ట్ర కోశాధికారి పెంకే సత్యనారాయణ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ఈనెల 17న తలపెట్టిన ఛలో విజయవాడ విజయవంతం చేసేందుకు సీఈఓలు, సిబ్బంది తరలిరావాలన్నారు.

బీజేపీ బాజాలు ఏపీలో మోగవు

కాకినాడ రూరల్: బీజేపీ బాజాలు ఏపీలో మోగవని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రీజనల్ కో–ఆర్డినేటర్ సివిల్ సప్లైస్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా పురందేశ్వరి బాధ్యతలు స్వీకరించినందున ఒక మహిళగా అభినందిస్తున్నాన్నారు. అయితే గతం గుర్తు చేసుకోవాలన్నారు. టీడీపీపై గతంలో సోమువీర్రాజు చేసిన ఆరోపణలపై స్పందించాలని కోరారు.

ప్రజల ముంగిట ప్రభుత్వపాలన



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- సురక్ష పథకంలో ఎమ్మెల్యే ద్వారంపూడి
- పలువురికి ధ్రువపత్రాల అందజేత

కాకినాడ: ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ సేవలు సత్వరమే అందుతున్నాయని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జగన్నాథపురం 24వ డివిజన్‌లోని ముగ్గపేట సచివాలయంలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం దుమ్ములపేట పావురాల తూము ప్రాంతంలో సచివాలయాన్ని కూడా ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ ధ్రువీకరణ పత్రాలను ఎమ్మెల్యే ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల కోసం నేరుగా ప్రజల వద్దకే వెళ్లి విచారించి సచివాలయాల వద్ద అందజేస్తున్నామన్నారు. గతంలో ఈ సర్టిఫికెట్ల కోసం ప్రజలు ఎంతో ప్రయాస పడేవారని, ఇప్పుడు ఆ సమస్య లేకుండా స్థానికంగా ఉండే సచివాలయాల వద్దే పొందే వెసులుబాటు కలిగిందన్నారు. కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు మీసాల దుర్గాప్రసాద్, మీసాల శ్రీదేవి, మోసా పేతూరు, మోసా దానమ్మ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వాసుపల్లి కృష్ణ, స్థానిక నాయకులు ఎరుపల్లి సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి అండగా నిలవండి

కాకినాడ: నిరంతరం ప్రజల కోసమే శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అన్ని వర్గాల ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక 34వ డివిజన్ రాగంపేటలో గురువారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే ద్వారంపూడి పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నాలుగేళ్ల పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రజల అభివృద్ధి, సంక్షేమంపై చిత్తశుద్ధి కలిగిన ముఖ్యమంత్రి వద్ద పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అందువల్లే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకుని మరీ పరిష్కరిస్తున్నామన్నారు. ఎలాంటి సమస్యనైనా పరిష్కరించగలమన్న ధైర్యాన్ని సీఎం జగన్ ఇచ్చారని, అటువంటి సీఎంకు ప్రజలంతా అండగా నిలిచి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్ తేహరా కాతూన్, స్థానిక నాయకులు అర్జు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు



ప్రభుత్వ పనితీరుపై ఎమ్మెల్యే కన్నబాబు వద్ద హర్షం వ్యక్తం చేస్తున్న వృద్ధురాలు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- ఇంద్రపాలెంలో గడప గడపకూ

కాకినాడ రూరల్: తమ ప్రభుత్వానికి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లలాంటివని, పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఇంద్రపాలెం సచివాలయం -4 పరిధిలో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆయన పర్యటించారు. విఘ్నేశ్వనగర్, చీడిగ, చీడిగ మెట్ట, మెరకవీధి, చీడిగ దిబ్బ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవ్వాతాతలతో ఆప్యాయంగా పలుకరించి పింఛన్ తీసుకుంటున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దే పింఛన్లు అందజేస్తున్నారని వృద్ధులు తెలియజేశారు. కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ముందు తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల మేరకు నవరత్న, సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి నూరుశాతం అమలు చేశారన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గ్రామ సచివాలయ భవనాల నిర్మాణం, నాడు–నేడు ద్వారా పాఠశాలలు రూపురేఖలు మార్చడం, ప్రజలకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల శ్రీను, అధికారులు, నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

గొర్రిపూడిలో ధ్రువపత్రాల పంపిణీ



గొర్రిపూడిలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కరప: ప్రజల ముంగిటనే ప్రభుత్వ సేవలు ఉచితంగా అందించేందుకు అమలుచేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ మాజీ చైర్మన్ చీకాల అప్పలరాజు అన్నారు. గొర్రిపూడి సచివాలయం–2లో గురువారం ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష శిబిరాన్ని ప్రారంభించి 581 మందికి వివిధ ధ్రువపత్రాలు అందజేశారు. ఎంపీడీఓ కె.అప్పారావు, డీటీ కె.అనిల్‌కుమార్, గ్రామకార్యదర్శి పి.శ్రీనివాస్, వీఆర్వో డి.భరణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై పర్యవేక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి సత్యనారాయణ

కాకినాడ రూరల్: ఓటర్ల జాబితాపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎన్‌వీవీ సత్యనారాయణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బూత్‌స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు ఇచ్చారు. ఒకే ఇంటిలో పది మంది ఓటర్లు నమోదై ఉంటే అటువంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చి మార్పులు, చేర్పులతో పాటు మరణించిన వారి విషయంలో క్షేత్రస్థాయి విచారణ చేసి దోషరహిత ఓటర్ల జాబితా రూపకల్పన చేయాలన్నారు. రూరల్, అర్బన్, కరప తహసీల్దార్లు మురార్జీ, సీతాపతిరావు, శ్రీనివాసరావు, ఎన్నికల డీటీ పాల్గొన్నారు.

చిరుజల్లుల పలకరింపు



వలసపాకల సంతోష్‌నగర్ కూడలి వద్ద నిలచిన వర్షపు నీరు

కాకినాడ రూరల్: చిరుజల్లుల పలకరింపుతో నిన్నటి వరకు మండిన మనసులు మురిసిపోయాయి. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు కురిసిన ఏకధాటి వానకు అంతా ఎంతో సేదతీరారు. రహదారులన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చినా మధ్యాహ్నానికి తెరిపివ్వడంతో అంతా రోడ్లపైకి వచ్చి పనుల్లో మునిగిపోయారు. ఖరీఫ్ సాగు కోసం ఎదురు చేస్తున్న రైతన్నలు మాత్రం వరుణుడు కరుణించాలని, వర్షాలతోనే సాగుకు అనుకూలమని చెబుతున్నారు. అవసరమైన మేరకు వానలు కురవాలని దేవుణ్ణి కోరుకుంటున్నారు.

విద్యుత్ భద్రతపై అవగాహన

కాకినాడ రూరల్: విద్యుత్ భద్రతపై కోరమండల్ ఎరువుల కర్మాగారంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యుత్ భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా విద్యుత్ తనిఖీ అధికారి వై.వెంకటరమణ కోరమండల్ కర్మాగారంలో పలు సూచనలు ఇచ్చారు.

ఆదమరిస్తే కాలువలోకే..

- రక్షణ గోడలు లేక ప్రయాణికుల అవస్థ
- అడుగుభాగం పెచ్చులూడి తుప్పు పట్టిన ఊచలు
- ఎస్సీ వీధి వద్ద శిథిలావస్థకు చేరిన వంతెన



కరప నక్కావారి ఎస్సీవీధి వద్ద పంట కాలువపై రక్షణ గోడలు లేని వంతెన

కరప: కరపలోని నక్కావారి ఎస్సీవీధి, అగ్నికుల క్షత్రియుల వీధి ప్రజలు శిథిలమైన వంతెనపై నుంచి రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతూనే ప్రయాణిస్తున్నారు. శిథిలమైన వంతెనను, వంతెనకు ఇరువైపులా కోసుకుపోయిన రోడ్డును వేసేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలోని ఈ రెండు వీధులకు వెళ్లాలంటే న్యూ భీమన్న కర్ర పంటకాలువ దాటి వెళ్లాలి. తహసీల్దార్ కార్యాలయం నుంచి కిలో మీటరు లోపలికి వెళ్లాల్సి ఉంటుంది. అగ్నికుల క్షత్రియులు, నక్కావారి ఎస్సీవీధి ప్రజలు గ్రామంలోకి రావాలన్నా, విద్యార్థులు చదువుకునేందుకు పాఠశాలలకు, కాకినాడ ఇతర పనులకు వెళ్లాలన్నా ఈ వంతెనే గతి. నిర్మించి చాలా కాలం కావడంతో వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన అడుగుభాగాన పెచ్చులు ఊడుతున్నాయి. వంతెనకు ఇరువైపులా ఉండే రక్షణగోడలు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

రెండు పక్కలా రోడ్డు కోసుకుపోయింది. వాహన చోదకులు, పాదచారులు తరచూ ప్రమాదాలపాలవుతున్నారు. టీడీపీ హయాంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అగ్నికుల క్షత్రియుల వీధి వరకు రోడ్డు నిర్మించి, వంతెనను విస్మరించారు. రోడ్డువేశాక వంతెన నిర్మిస్తామన్న కాంట్రాక్టర్ తర్వాత నిర్మాణాన్ని వదిలేశారు. పెను ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి సత్వర చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన అగ్నికులక్షత్రియులు, ఎస్సీలు కోరుకుంటున్నారు.

వంతెన నిర్మించాలి



వంతెన నిర్మించి చాలా కాలమైంది. అడుగుభాగాన పెచ్చులూడి, ఇనప ఊసలు బయటకు కనిపిస్తూ, తుప్పుపట్టాయి. వంతెన రక్షణగోడలు పడిపోవడంతో ఎదురెదురుగా వచ్చే వాహనాలు తప్పించుకునేందుకు ఖాళీలేక కాలువలో పడిపోతున్నారు. వంతెన వెడల్పుచేసి, కొత్తగా నిర్మించాలి.

– దండంగి శ్రీనివాస్, ఎస్సీవీధి, కరప

ఎమ్మెల్యే కన్నబాబు దృష్టికి తీసుకెళ్లాం



కరప ఎస్సీవీధి వద్ద పంట కాలువపై ఉండే వంతెన శిథిలావస్థకు చేరి పడిపోయేలా ఉంది. కొత్త వంతెన నిర్మించాలని ఎస్సీ, అగ్నికుల క్షత్రియ వీధివారు కోరుతున్నారు. వంతెన సమస్య గురించి ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు వివరించాం. కొత్తవంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తామన్నారు.

– సాదే ఆశాజ్యోతి, కరప సర్పంచ్

వలంటీర్లకు వందనం

సేవలకు ప్రతిరూపం



నందితకు పింఛన్ అందిస్తున్న వలంటీరు దుర్గాభవాని

కాకినాడ రూరల్ మండలం వాకలపూడి శ్రీనివాసనగర్‌కు చెందిన వలంటీర్ కె.దుర్గాభవాని సేవలకు ప్రతిరూపంగా మారింది. నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలతో పాటు పలు రకాల సర్టిఫికెట్లు ప్రజలకు అందించేందుకు కృషి చేస్తోంది. నడవలేని స్థితిలో ఉన్న, వృద్ధాప్యంలో ఉన్న అవ్వాతాతలకు చేదోడుగా ఉంటూ పింఛన్ సొమ్ములను వారి ఇళ్ల వద్దనే అందించడంతో పాటు వారికి కావల్సిన మందులు అందిస్తోంది. శ్రీనివాసనగర్‌లో పుట్టుకతోనే దివ్యాంగురాలుగా మంచానికి పరిమితమైన 21 ఏళ్ల పెనుమల్లు నందిత వద్దకు వెళ్లి ప్రతి నెలా ఒకటో తేదీన ఆప్యాయంగా పలకరించి పింఛన్ అందజేస్తోంది. తనకు కేటాయించిన 50 కుటుంబాల ప్రజలు వలంటీర్ దుర్గాభవాని పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పింఛన్, ఈబీసీ నేస్తం, ఇంటి స్థలం ఇప్పించారు



మంచంపైనే ఉండే మా మనవరాలు పెనుమల్లు నందితకు ప్రతి నెలా వలంటీర్ దుర్గాభవాని వచ్చి పింఛన్ ఇవ్వడమే కాదు, ఆప్యాయతను పంచుతోంది. నా భర్త వృద్ధాప్య పింఛన్, మా కుటుంబానికి ఈబీసీ నేస్తం, ఇంటి స్థలం వచ్చింది. వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చిన సీఎం జగన్‌కు ధన్యవాదాలు.

– చింతపల్లి రత్నం, శ్రీనివాసనగర్, వాకలపూడి

కష్టకాలంలో అండగా..



కరోనా సమయంలో పింఛను అందజేస్తున్న వలంటీర్ సతీష్

కరోనా కాలంలో నిరుపేదల జీవనం చాలా అస్తవ్యస్తంగా మారింది. ఎంతో మంది పేదలు పూట గడిపేందుకు నానా కష్టాలు పడ్డారు. అలాంటి తరుణంలో కాకినాడ పేర్రాజుకు పేటలకు చెందిన వలంటీర్ సతీష్ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. కరోనా సమయంలో దాతల సహకారంతో ఇంటింటికీ వచ్చి భోజనాలు, టిఫిన్లు పంపిణీ చేశారు. డిగ్రీ చదువుకున్న ఈ యువకుడు జీతం తక్కువైనా సమాజ సేవ కోసం వలంటీర్‌గా చేరాడు. నాలుగేళ్లుగా ప్రభుత్వ పథకాలు, సేవల గురించి ఇంటింటికీ వెళ్లి తెలియజేసి అర్హులకు వాటిని సకాలంలో అందిస్తున్నారు.

సొంత మనుమడిలా సాయం చేశాడు

మాది నిరుపేద కుటుంబం. పనికి వెళితేకానీ కుటుంబం గడవని పరిస్థితి. మా వలంటీర్ సతీష్ మాకు కరోనా సమయంలో నిత్యావసర వస్తువులు అందించి మనుమడిలా అండగా నిలిచాడు. మందులు కొనుగోలుకు కూడా సహాయం చేశాడు. వలంటీరు చేసిన సహాయం మేము ఎప్పటికీ మరవలేము.

– అదపా ఆదినారాయణ, లబ్ధిదారు

వృద్ధులకు రక్షణగా ట్రిబ్యునళ్లు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీలక్ష్మి

కాకినాడ రూరల్: తరిగిపోతున్న మానవ విలువల వల్ల వృద్ధులు వేధింపులకు గురైతే జిల్లా, డివిజన్ స్థాయిలో ఏర్పాటైన ట్రిబ్యునళ్లను సంప్రదిస్తే తగిన న్యాయం లభిస్తుందని న్యాయవాది శ్రీలక్ష్మి పేర్కొన్నారు. రమణయ్యపేట కొత్తూరులో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. పిల్లలు, బంధువులు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా వేధిస్తే ట్రిబ్యునళ్లను సంప్రదిస్తే చట్టరీత్యా వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులను పిల్లలు చూడకపోయినా భరణంగా ప్రతినెలా నగదు ఇప్పించే అవకాశం ఉందన్నారు. వృద్ధుల సహాయం కోసం 14567 హెల్ప్ లైన్ కూడా అందుబాటులో ఉన్నందున ఏమైనా సమస్య వస్తే ఆ ఫోన్ నెంబరుకు కూడా ఫిర్యాదు చేయవచ్చని శ్రీలక్ష్మి తెలిపారు. అడబాల రత్నప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధికి నిధులు కేటాయించండి

కాకినాడ సిటీ: సంచార జాతులు అభివృద్ధికి తోడ్పడేలా కేంద్ర ప్రభుత్వం సీ ప్రోగ్రాం ద్వారా నిధులు కేటాయించి ఆదుకోవాలని అఖిల భారత సంచార జాతుల అభివృద్ధి మండలి జిల్లా అధ్యక్షుడు దమ్ము చిన్న, అంబేడ్కర్ కోనసీమ జిల్లా మహిళా అధ్యక్షురాలు రొట్ట సత్యవతి డిమాండ్ చేశారు. గురువారం కాకినాడ ఇంద్రపాలెం లాకుల సమీపంలో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సంచార జాతులను అట్రాసిటీ చట్టం పరిధిలోకి తీసుకురావాలని ఓబీసీ కమిషన్ నివేదిక ఆధారంగా ఈ కులాలకు ప్రత్యేక రిజర్వేషన్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ జీవో ప్రకారం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సంచార జాతుల జనాభా లెక్కల సేకరణ తక్షణం చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంచార జాతుల కార్పొరేషన్ ద్వారా నిధులు విడుదల చేయాలని కోరారు. సంచార జాతులకు డీఎన్టీ బోర్డును పునరుద్ధరించాలన్నారు. ఈ సమస్యల సాధనకు త్వరలోనే రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు పిల్లి సత్తిబాబు, గ్రంధి ప్రసాద్, దమ్ము సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ



కరప హైస్కూలులో దాతలు బహూకరించిన బీరువాలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థి గొల్లపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు రూ.54 వేల విలువైన ఫర్నిచర్ బహూకరించారు. 1982వ సంవత్సరం 10వ తరగతి విద్యార్థి అయిన గొల్లపల్లి రెండు గాడ్రేజ్ బీరువాలు, రెండు టేబుళ్లు, రెండు కుర్చీలు బహూకరించారు. అదే పాఠశాలలో పనిచేసిన విశ్రాంత రికార్డ్ అసిస్టెంటు వి.వాణి కూడా ఒక బీరువాను బహూకరించారు. వీటిని గురువారం జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి హైస్కూలు హెచ్‌ఎం యు.లీలామనోహర్‌కు అందజేశారు. దాతలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, వాణిలను ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. పూర్వ విద్యార్థులు పెంకే సత్తిబాబు, సాదే లోహిదాస్‌కుమార్, ముద్రగడ పెద్దకాపు, కె.వెంకటరమణ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో మెరిసిన విద్యార్థులు



ఎం.ఆశా షైనీ



టీజీ శశిరేఖ



కె.లిఖిత



కె.మనోజ్‌కుమార్



కె.సౌమ్య దుర్గాలక్ష్మి



ఎస్.ప్రియరత్న గాయత్రి



తెలగారెడ్డి షర్మిలసత్య



బైనా మానససాయి



గుంటూరు వైష్ణవి

కాకినాడ రూరల్: ట్రిపుల్ ఐటీ సంస్థల్లో ఇంటర్మీడియట్, ఉన్నత చదువులు కోసం కాకినాడ రూరల్ మండలం నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ట్రిపుల్ ఐటీ ఫలితాలను గురువారం ప్రభుత్వం ప్రకటించగా రూరల్ మండలంలోని విద్యార్థులు సత్తా చాటారు. ఎంపికైన ఆరుగురులో ఐదుగురు బాలికలు కావడం విశేషం. ఏపీఎస్పీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 566 మార్కులు సాధించిన ఎం.ఆశా షైనీ ట్రిపుల్ ఐటీ నూజివీడుకు, అదే పాఠశాలకు చెందిన టీజీ శశిరేఖ శ్రీకాకుళానికి, నేమాం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.లిఖిత నూజివీడుకు, వాకలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని మనోజ్‌కుమార్ ఒంగోలు, తమ్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.సౌమ్య దుర్గా లక్ష్మి శ్రీకాకుళం, తూరంగి విద్యార్థిని ఎస్.ప్రియ రత్న గాయత్రి నూజివీడుకు ఎంపియ్యారు. ఎంపికై న విద్యార్థులకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, నాయకులు, అధికారులు, ఎంఈఓ గణేష్‌బాబు, హెచ్‌ఎంలు అభినందించారు.

కరప నుంచి ముగ్గురు..

కరప: మండలం నుంచి ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈఓలు ప్రత్తి సత్యనారాయణ, కె.బుల్లి కృష్ణవేణి తెలిపారు. కరప నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు హెచ్‌ఎం యు.లీలామనోహర్ గురువారం తెలిపారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో తెలగారెడ్డి షర్మిలసత్య ప్రతిభచూపి 564 మార్కులు సాధించింది. ఇప్పుడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. తండ్రి వెంకటసత్యనారాయణ ఐ.పోలవరం మండలం జి.వేమవరం గ్రామానికి చెందిన వారు. కరప వచ్చి, ఒక రైస్ మిల్లులో పనిచేస్తున్నారు. ఇంజినీరింగ్ చదవాలనేది తన జీవిత ఆశయమని షర్మిలసత్య తెలిపింది. కరప గ్రామానికి చెందిన బైనా మానససాయి పదో తరగతిలో 554 మార్కులు రాగా, ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించింది. తండ్రి శివ తాపీమేస్త్రిగా పనిచేస్తుంటారు. ఇంజినీరింగ్ చదివి మంచి ఉద్యోగం సాధించడమే జీవితాశయంగా మానస తెలిపింది. వేళంగి గ్రామానికి చెందిన గుంటూరు వైష్ణవి పదో తరగతిలో 561 మార్కులు రాగా, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్టు ఎంఈఓ సత్యనారాయణ తెలిపారు.